చిలుకూరు : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ గిరిబాబు

గ్రామాల్లో మంచినీటి సమస్య రాకుండా చూడాలి

● ఎంపీడీఓ గిరిబాబు

చిలుకూరు, మే15, గ్రామాల్లో మంచినీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎంపీడీఓ గిరిబాబు సిబ్బందికి సూచించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందికి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సంక్షేమ పథకాలు అర్హులైన అందరికీ అందేలా చూడాలన్నారు. గ్రామ నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ ఇబ్రహీం, ఏపీఓ నిర్మల, గ్రామ కార్యదర్శులు, టీఏలు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి : ఎంపీడీఓ సునీత

నూతనకల్ : వేసవి నేపథ్యంలో మండలంలోని పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలు, క్రీడా ప్రాంగణాలు, డంపింగ్ యార్డులు, వైకుంఠ ధామాల్లో నాటిన మొక్కలను సంరంక్షించాలని ఎంపీడీఓ సునీత అన్నారు. మండల పరిధిలోని మిర్యాల, లింగంపల్లి, అల్గునూరు గ్రామాల్లోని పల్లె ప్రకృతి వనాలు, వన నర్సరీలను ఆమె పరిశీలించి మాట్లాడారు. మొక్కలు ఎండిపోకుండా రెండు రోజులకు ఒకసారైనా నీళ్లు పట్టాలన్నారు. వన నర్సరీలో నాటిన ప్రతి మొక్కను సంరంక్షించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు ట్యాంకర్ డ్రైవర్లను ఒక రోజు చెత్త సేకరణకు, మరోరోజు ట్యాంకర్‌కు పంపించాలని సూచించారు. వీధులను, డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని, పంచాయతీ రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని పేర్కొన్నారు. ఆమె వెంట ఏపీఓ శ్రీరాములు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

తాటి ముంజలకు భలే గిరాకీ

పాలకవీడు, మే 15 : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో తాటి ముంజలకు గిరాకి పెరిగింది. పెరుగుతున్న ఎండల తీవ్రతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలు వేసవి తాపం తీర్చేలా ప్రకృతి సిద్ధంగా లభిస్తున్న తాటి ముంజల కొనుగోళ్లకు ఆసక్తి చూపుతున్నారు. గరిడేపల్లి, పెన్‌పహాడ్ మండలాలకు చెందిన పలువురు మహిళలు ముంజల గంపలతో రోజూ ఉదయమే మండల కేంద్రానికి చేరుకుంటున్నారు. మండల కేంద్రంలోని చౌరస్తాతో పాటు పలు వీధుల్లో డజను రూ.40 నుంచి 50 చొప్పున అమ్మకాలు జరుపుతున్నారు. మండే ఎండలను సైతం లెక్క చేయకుండా అమ్ముతున్నారు. ప్రస్తుత కరువు పరిస్థితుల్లో తాటి ముంజల విక్రయంతో రోజూ రూ.500 నుంచి 600 వరకు ఆదాయాన్ని పొందుతున్నట్లు మహిళలు వెల్లడిస్తూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

పాలకవీడులో తాటి ముంజలను విక్రయిస్తున్న మహిళలు

ఆస్పత్రి ముందు ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు

గుండెపోటుతో వాచ్‌మన్ మృతి

- ఆస్పత్రి నిర్లక్ష్యమేనని కుటుంబ సభ్యుల ఆరోపణ
- న్యాయం చేయాలని ఆందోళనకు దిగిన బంధువులు

బొడ్రాయిబజార్, మే 15 : చివ్వెంల మండలం గుంపుల తిరుమలగిరి గ్రామానికి చెందిన నకిరేకంటి పుల్లయ్య (60) జిల్లా కేంద్రంలోని ఆర్వి ఆస్పత్రిలో నైట్ వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు. బుధవారం ఉదయం 6 గంటల వరకు విధులు నిర్వహించిన పుల్లయ్య ఒక్కసారిగా కుప్పకూలాడు. దాంతో ఆస్పత్రి సిబ్బంది వెంటనే అత్యవసర వైద్యం అందించినప్పటికి ఫలితం లేకపోవడంతో పుల్లయ్య మృతి చెందాడు. గుండెపోటే మృతికి కారణమని వైద్యులు నిర్ధారించారు. అయితే మృతి సమాచారం తెలిసిన పుల్లయ్య కుటుంబ సభ్యులు, బంధువులు డాక్టర్లు, ఆస్పత్రి యాజమాన్యం నిర్లక్ష్యమే మృతికి కారణమంటూ ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు. పుల్లయ్య మృతికి కారణం విద్యుత్ షాక్‌కే కారణమని పేర్కొంటూ మృతదేహంతో సుమారు 4 గంటల పాటు ఆందోళన నిర్వహించారు. ఆస్పత్రి సీసీ ఫుటేజీ చూపించినప్పటికీ వినిపించుకోకుండా బంధువులు న్యాయం చేయాలని ఆందోళనను కొనసాగించారు. దాంతో పట్టణ సీఐ రాజశేఖర్ కలుగజేసుకుని వారికి నచ్చజెప్పి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో బర్రెలు మృతి

చిలుకూరు, మే 15 : విద్యుదాఘాతంతో పాడి బర్రెలు రెండు మృతిచెందాయి. ఈ ఘటన బుధవారం మండలంలోని ఆచార్యులగూడెం గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన మునగాల సైదిరెడ్డికి చెందిన బర్రెలు రోజువారిగా మేతకు పొలాలకు వెళ్లాయి. పొలాల్లో విద్యుత్ తీగలు తెగి కిందపడటంతో కరెంట్ షాక్‌కు గురై అక్కడిక్కడే మృతిచెందాయి. సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.

రైతన్న రోడ్డెక్కితేనే ధాన్యం కొంటుండ్రు

జిల్లాలో నిత్యం అన్నదాత ఆందోళనలు

లేదంటే వారాలైనా పట్టించుకునే వాళ్లే లేరు

- రహదారులపై ధాన్యం రాశులు పోసి నిరసనలు
- ప్రభుత్వ తీరుపై భగ్గుమంటున్న రైతులు
- పదేండ్లలో తొలిసారి రైతన్నకు ధాన్యం కష్టాలు
- వడ్ల సేకరణను గాలికొదిలేసిన సర్కారు
- జిల్లాలో ఇప్పటి వరకు సగం కూడా కొనలే..
- లక్ష్యం 4.45లక్షల మెట్రిక్ టన్నులు.. కొన్నది 2.20 మెట్రిక్ టన్నులే..
- కాంటా వేసి వడ్లను తరలించడంలోనూ నిర్లక్ష్యమే..
- వానలకు దెబ్బ తింటున్న కర్షకులు

యాదాద్రి భువనగిరి, మే 15 (నమస్తే తెలంగాణ) : అందరికీ అన్నం పెట్టే అన్నదాతకు అష్టకష్టాలు వచ్చాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వడ్ల సేకరణను గాలికొదిలేసింది. వారాల కొద్దీ ధాన్యం కొనుగోలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నది. జిల్లాలో ఇప్పటి వరకు సగం కూడా వడ్లను కొనుగోలు చేయలేదు. కాంటా వేసిన ధాన్యాన్ని తరలించడంలోనూ జాప్యం చేస్తున్నది. ఫలితంగా చేసేదేం లేక రైతులు రోడ్డెక్కుతున్నారు. రోడ్లమీదకు వచ్చి ఆందోళన చేస్తేనే ప్రభుత్వం దిగివస్తున్నది. జిల్లా వ్యాప్తంగా నిత్యం రెండు, మూడు చోట్ల ధాన్యం కొనుగోళ్లు చేయాలని ఆందోళనలు చేపడుతున్నారు.

కేంద్రాల్లో ఎక్కడి ధాన్యం అక్కడే..

జిల్లాలో 2.93లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. సుమారుగా 5.25లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. పౌర సరఫరాల అధికారులు మాత్రం నాలుగున్నర లక్షల టన్నుల వడ్లు సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఇందుకోసం జిల్లాలో 323 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఇంతవరకు బాగానే ఉన్నా ధాన్యం కొనుగోళ్లు మాత్రం సజావుగా సాగడం లేదు. కొనుగోలు కేంద్రాల్లో ఎక్కడ పోసిన ధాన్యం కుప్పలు అక్కడే దర్శనమిస్తున్నాయి. కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యంతో రైతులు రోజుల తరబడి కేంద్రాల్లోనే నిరీక్షిస్తున్నారు.

భూదాన్‌పోచంపల్లిలో పేరుకుపోయిని ధాన్యం రాశులు

నెలన్నర గడుస్తున్నా..

జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి నెలన్నర గడుస్తున్నా ఇంకా సగం ధాన్యం కూడా కొనలేదు. ఈ నెల 14వ తేదీ వరకు 22,552 రైతుల నుంచి 2,20,798 మాత్రమే కొనుగోలు చేశారు. అంటే లక్ష్యంలో సగం కూడా కొనుగోళ్లు జరుగలేదు. వీటిలో 2,09,886 మెట్రిక్ టన్నులు మిల్లులకు ధాన్యం తరలించగా, ఇంకా 10,912 మెట్రిక్ టన్నుల ధాన్యం తరలించాల్సి ఉంది. ఇక రైతులకు డబ్బుల చెల్లింపుల్లోనూ ఆలస్యం జరుగుతున్నది. రూ.484.96 కోట్లు రైతులకు చెల్లించాల్సి ఉండగా, ఇప్పటి వరకు రూ.300.23 కోట్లు మాత్రమే జమ చేశారు. ఇంకా రూ.184.73 కోట్లు రైతులకు చెల్లించాలి.

హమాలీలు, లారీల కొరత..

వడ్ల కొనుగోళ్ల జాప్యానికి అధికారులు అనేక కారణాలను చెబుతున్నారు. జిల్లాలోని ఉన్న 40 రైస్ మిల్లులన్నీ ధాన్యంతో నిండుగా ఉన్నాయి. గత యాసంగికి చెందిన 1.80లక్షల మెట్రిక్ టన్నులు, వానకాలం సీఎంఆర్ ఇంకా మిల్లుల్లోనే ఉండటంతోనే స్థలం కొరత ఏర్పడింది. అదే విధంగా ఎఫ్‌సీఐ గోదాముల్లో సీఎంఆర్ దించుకోవడంలోనూ జాప్యం జరుగుతున్నది. కొనుగోలు కేంద్రాలకు టార్పాలిన్లు సరిపోవడంలేదు. కొనుగోలు కేంద్రాల్లో కాంటా పెట్టడమే గగనంగా మారింది. ఇక మిల్లుల్లో హమాలీల కొరత ఉంది. కాంటా పెట్టిన వడ్ల సంచులను మిల్లులకు తీసుకెళ్లిన లారీలను అన్‌లోడ్ చేయడానికి హమాలీలు సరిపడా లేరు. వెళ్లిన లారీలు తిరిగి రావడానికి రోజుల సమయం పడుతున్నది.

మోత్కూరు మండలంలోని సదర్శాపురంలో తూకాలైనా ఎగుమతి లేక కొనుగోలు కేంద్రంలోనే నిలిచి పోయిన ధాన్యం బస్తాలు

రైతుల ఆందోళనలు కొన్ని..

- ఈ నెల 14 : నెలలు గడుస్తున్నా ధాన్యం కొంటలేరని భువనగిరి మండలంలోని ఏటీబీ తండాకు చెందిన గిరిజన రైతులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు.
- ఈ నెల 14 : ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని భూదాన్‌పోచంపల్లి ఎంపీడీఓ కార్యాలయం ఎదుట రైతులు, లారీ డ్రైవర్లు నిరసన వ్యక్తం చేశారు.
- ఈ నెల 13 : పోలింగ్ రోజు భూదాన్ పోచంపల్లి మండలంలోని కనుముక్కుల గ్రామంలో ధాన్యం కొంటనే ఓటేస్తామని రోడ్డు పైకి వచ్చి ఆందోళన చేపట్టారు.
- ఈ నెల 8 : ధాన్యం కొనుగోళ్లలో జాప్యాన్ని నిరసిస్తూ భూదాన్ పోచంపల్లి మండలంలోని జూలూరు, పెద్దగూడెం రైతులు రోడ్డుపై కంచె వేసి ఆందోళన చేపట్టారు.
- ఈ నెల 8 : అడ్డగూడూరు మండలం చౌల్ల రామారంలో రైతులు రోడ్డుపై వడ్లు పోసి నిరసన వ్యక్తం చేశారు.
- ఏప్రిల్ 30 : వారాలు గడుస్తున్నా ధాన్యం కొంటలేరని వలిగొండ మండలంలోని వర్కట్‌పల్లి, సంగెం గ్రామాల రైతులు ట్రాక్టర్లు అడ్డుగా పెట్టి రహదారిపై ధర్నా చేశారు.

కేసీఆర్ సర్కారులో సాఫీగా ధాన్యం కొనుగోళ్లు

ఉమ్మడి రాష్ట్రంలో రైతుల పరిస్థితి దయనీయంగా ఉండేది. ధాన్యం కొనుగోళ్లు సరిగా జరిగేవి కాదు. రైతులకు మద్దతు ధర కూడా అంతంతమాత్రంగానే ఉండేది. దీంతో రైతులు దళారులను ఆశ్రయించి అమ్ముకునేవారు. కానీ తెలంగాణ రాష్ట్రం వచ్చాక రైతుల పరిస్థితి మెరుగైంది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులపై స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఎక్కడా, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలకు ఆదేశించారు. దాంతో పదేండ్లలో ధాన్యం కొనుగోళ్లలో ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాఫీగా జరిగేది. అన్నదాత ఖాతాల్లో డబ్బులు కూడా ఎప్పటికప్పుడుఏ జమ అయ్యేవి. రైతులు కూడా ఎంతో సంతోషంగా ఉన్నారు. కానీ కాంగ్రెస్ వచ్చాక మళ్లీ సీన్ రివర్సయ్యింది. ధాన్యం సేకరణను గాలికొదిలేసింది.

ఆందోళనలు చేస్తే తప్ప.. పట్టించుకుంటలే..

జిల్లాలో రైతులు ప్రభుత్వ తీరుతో విసిగిపోయారు. వారాలు, నెలలు గడుస్తున్నా ధాన్యం కొంటలేరు. వర్షాలతో కేంద్రాల్లోనే ధాన్యం తడుస్తున్న పరిస్థితి. తడిసిన ధాన్యం కొంటామని చెబుతున్నా ఎక్కడా కొనడం లేదు. మంచి ధాన్యానికే కొర్రీలు పెట్టి కోతలు పెడుతున్నారు. బస్తాకు మూడు నుంచి నాలుగు కిలోలు తరుగు తీస్తున్నారు. ఏ గ్రేడ్ ధాన్యాన్ని బీ గ్రేడ్‌కు లెక్కగడుతున్నారు. దీంతో కర్షకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏకంగా రోడ్డుపైకి వచ్చి ఆందోళనలు చేస్తున్నారు. యాదాద్రి భువనగిరి కలెక్టరేట్ ఎదుట ఇటీవల వివిధ మండలాల రైతులు ధర్నా చేపట్టారు. పండించిన ధాన్యాన్ని తీసుకొచ్చి రాశులుగా పోసి నిరసన తెలుపుతున్నారు. ఆందోళన చేస్తే అధికారులు వెంటనే స్పందించి సదరు కేంద్రాలను సందర్శించి సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నారు. లేకుంటే మాత్రం అటు వైపు కూడా చూడటం లేదు. మరోవైపు ఆకాశంలో మబ్బులతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే జిల్లాలో పలు చోట్ల వర్షానికి ధాన్యం తడిసి అన్నదాతలు లబోదిబోమంటున్నారు.

రోజంతా కుప్పకాడనే ఉండాల్సి వస్తున్నది

చౌటుప్పల్ మార్కెట్‌కు వడ్లు తెచ్చి నెల దగ్గరకు వస్తున్నది. మొన్నటి గాలివానకు తడిసినయి. నాలుగు రోజులు ఆరబెట్టిన. తెచ్చిన రెండు మూడు రోజులకు తూకం వేస్తే ఈ బాధలుండకపోవు. ప్రతి దినం పొద్దుగాళ్ల వచ్చి పొద్దుపోయోవరకు కుప్ప కాడనే ఉండాల్సి వస్తున్నది. చాలా బాధ అయితున్నది. ఇప్పటికైనా తూకం వేయాలి. లేకుంటే వచ్చే వానలకు మళ్లీ వడ్లు తడుస్తయి.

-తూర్పింటి పారిజాత, మహిళా రైతు, రాంనగర్, చౌటుప్పల్

వానకు వడ్లు తడిసినయ్

చౌటుప్పల్ మార్కెట్‌లో వడ్లు పోసి 20రోజులు దాటింది. ఇప్పటివరకు మాయిశ్చర్ కూడా చూడలేదు. తూకం వేయడానికి ఎన్నిరోజులు పడుతుందో. ఇంతకుముందు కురిసిన వానలకు వడ్లు తడిసినయి. నాలుగు రోజులు ఆరబెట్టిన. రోజూ మార్కెట్‌కు వచ్చిపోవుడే సరిపోతున్నది. ఇతర వ్యవసాయ పనులు చేసుకోలేకపోతున్నం. ఇంకో పది రోజులు అయితే రోహిణి కార్తె వస్తుంది. ఇలానే అయితే పనులు ఎట్లా చేసుకోవాలి. వాన కాలం నెత్తి మీదికి వచ్చినట్లే. ఏమి చేయాలో ఏమో. వడ్లు పండించడం కన్నా అమ్మడం పెద్ద కష్టంగా ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం పట్టించుకొని వడ్లు తొందరగా కొనాలి.

-బొల్లమోని శంకరయ్య, తంగడపల్లి, చౌటుప్పల్

అరకిలో తరుగు తీస్తున్నారు..

మా గ్రామంలో బస్తాకు 500 గ్రాములు ఎక్కువ తూకం వేస్తున్నారు. షార్టేజ్ వస్తదని 500 గ్రాములు తూకం వేయడంతో రైతులపై భారం పడుతున్నది. కొనుగోలు కేంద్రంలో లారీ లోడ్ కాగానే మిల్లుల వద్ద వెంటనే ధాన్యం దిగుమతి చేసుకోవాలి. రెండు మూడు రోజులు లారీల్లో ధాన్యం అలాగే ఉండడం వల్ల షార్టేజ్ వస్తుంది. 20 రోజుల క్రితం ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చిన. ధాన్యం కుప్పల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తుంది.

-మేకల మల్లారెడ్డి, శివారెడ్డిగూడెం, భూదాన్‌పోచంపల్లి మండలం

నెలన్నర గడిచినా కొనుగోలు చేసే దిక్కులేదు

మద్దతు ధరను ఆశించి కొనుగోలు కేంద్రానికి ధాన్యం తెస్తే నెలన్నర గడిచినా కొనుగోలు చేసే దిక్కు లేదు. తాలు చెత్త లేకుండా తూర్పార బట్టి, ఆరబెట్టి ధాన్యం కుప్పలు పోసి పెట్టినం. లారీల కొరత, మిల్లుల వద్ద దిగుమతి కావడం లేదని కొనుగోలు కేంద్రం నిర్వాహకులు రాశులకు తూకాలు చేయడం లేదు. సీరియల్ పేరిట నిర్వాహకులకు డబ్బులు ఇచ్చిన వారి ధాన్యం తూకాలు వేస్తున్నారు. ఇవ్వని రైతుల ధాన్యం రాశుల వైపు కన్నెత్తి చూడటం లేదు. ఇదేమిటని అడిగితే దిక్కున్న చోట చెప్పుకో అంటున్నారు. వానలు పడుతుండడంతో ధాన్యం తడుస్తుందని భయమేస్తున్నది.

- దొండ నర్సయ్య రైతు, సదర్శాపురం, మోత్కూరు మండలం

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

RECRUITMENT
★Pen, Pencil Company, Educated, Unemployed Girls/Boys, Male/Female, House Wife Earn 24500-64500 Packing Work at Home 9034548725, 9728230253
NT-3277

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన లీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.
నల్లగొండ : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059 | సూర్యాపేట : 9182777630 | భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059 | కోదాడ : 9182777196 | చౌటుప్పల్ : 9182777638

నారాయణఖేడ్ ఆర్డీఓపై చర్యలు తీసుకోవాలి

● టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

కోదాడ టౌన్, మే 15 : నిబంధనల ప్రకారం ఉపాధ్యాయులకు వచ్చే టీఏ, డీఏ చెల్లించాలన్నందుకు పోలీసులతో లాఠీచార్జ్ చేయించిన నారాయణఖేడ్ ఆర్డీఓపై చర్యలు తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి ఎన్.నాగేశ్వర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జీఓ ప్రకారం రెమ్యూనరేషన్ చెల్లించాలని ప్రశ్నిస్తే పోలీసుల చేత కొట్టించడం అప్రజాస్వామికం అన్నారు. లాఠీచార్జిని ఖండిస్తూ ఆర్డీఓపై చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.

నేరేడుచర్ల : ఉపాధ్యాయులపై లాఠీచార్జి చేయించిన నారాయణఖేడ్ ఆర్డీఓపై చర్యలు తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి వై.కృష్ణయ్య, అక్కయ్యబాబు డిమాండ్ చేశారు. బుధవారం విలేకరులతో వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నంబర్ 691 ప్రకారం ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులకు నిబంధనల ప్రకారం రెమ్యూనరేషన్ చెల్లించాలని అడిగినందుకు లాఠీచార్జ్ చేయించడాన్ని యూటీఎఫ్ సంఘం తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఆర్డీఓ తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పడంతో పాటు నిబంధనల మేరకు రెమ్యూనరేషన్ చెల్లించాలని పేర్కొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి గ్రామోత్సవం

మఠంపల్లి, మే 15 : మండల కేంద్రంలోని బ్రహ్మాంగారి దేవాలయంలో నెలకొన్న రాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామి వారి గ్రామోత్సవంను నారసింహ మాలదారులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివార్లకు తిరుమంజన అభిషేకం జరిపించారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రత్యేక రథంపై నారసింహ నామ సంకీర్తనతో గ్రామోత్సవం నిర్వహించారు.

రాయితీపై జీలుగ విత్తనాలు

సూర్యాపేట, మే 15 : జిల్లాలోని రైతులకు రాయితీపై జీలుగ విత్తనాలు పంపిణీ చేయడం జరుగుతుందని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 23 మండలాల్లో విత్తనాలు సరఫరా చేయడం కోసం 39 పీఏసీఎస్, ఆర్ఎస్‌కే సెల్ కౌంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 1,150 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. పచ్చి రొట్ట ఎరువులు (జీలుగ) వేయదలిచిన రైతులు సంబంధిత మండల వ్యవసాయ అధికారిని సంప్రదించాలని సూచించారు.

కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి

● బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకుడు లింగయ్యయాదవ్

బొడ్రాయిబజార్, మే 15 : కామిరెడ్డి బీసీ డిక్లరేషన్‌ను తక్షణమే అమలు చేయాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ వీరబోయిన లింగయ్యయాదవ్ బుధవారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రవేశపెట్టిందన్నారు. రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

కుమ్మరి సత్రం నూతన కమిటీ

మఠంపల్లి, మే 15 : మండలంలోని మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో గల శాలివాహన (కుమ్మరి) సత్రం నూతన కమిటీ ఎన్నికను బుధవారం నిర్వహించారు. సత్రం నూతన అధ్యక్షుడిగా గొట్టం సంజీవరావు, ప్రధాన కార్యదర్శిగా మామిడి రామారావు, కోశాధికారిగా మలికంటి మట్టపల్లిరావు, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్, గొల్లపల్లి కోటయ్య, సహాయ కార్యదర్శులుగా కొలిపాక కృష్ణ, సలికంటి రాజారావు, చీర్లెదిన్నె ఉమా మహేశ్వర్‌రావు ఎన్నికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో సంగాపు మాల్యాద్రి, మలికంటి బుచ్చయ్య, సైదులు, సుబ్బారావు, కాశయ్య పాల్గొన్నారు.

'ఉపాధి హామీ వేతనాలు విడుదల చేయాలి'

మోతె, మే 15 : పాన్‌కార్డు లేదని ఉపాధి హామీ కూలీలకు పోస్టల్ అధికారులు వేతనాలు విడుదల చేయకపోవడం దారుణమైన విషయమని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు బుధవారం ఒక ప్రకటనలో అన్నారు. మండల పరిధిలోని రాఘవపురం, నామవరం గ్రామ ఉపాధి కూలీలకు సుమారు రూ.20 లక్షలు ప్రభుత్వం నుంచి మంజూరై నెలలు గడుస్తున్నా వేతనాలు విడుదల చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు ఆరోపించారు. తక్షణమే ఉపాధి కూలీల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని లేనియెడల పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు.